# వ్యధ

★ శ్రీమతి గోటేటి బంగారమ్మగారు

ప్రశాంత నిశా సమయాన ఓ వృద్ధ కంఠం, చీకటిని చీల్చుకుని ప్రస్ఫుటంగా ప్రతిధ్వనించింది. విస్మయంతో నాపురోగమనాన్ని ఖండించి అలా వింటూ వుండిపోయాను.

"హే భగవంతుడా! ప్రభో, ఎక్కడ వున్నావు నాయనా! ఇందతా నీలీలా నటనమేనా. ఈ ప్రపంచంలో ఏనాటికైనా శాంతి దేవత కన్ను తెరచి చూస్తుందా. ప్రజా స్వాతంత్ర్యం, ప్రజా స్వాతంత్ర్యం" అంటే ఏమిటో అనుకున్నా. అందరూ కలసి మెలసి వుంటారు, దేశం సశ్యశ్యామలం అవుతుంది అనుకున్నా. చివరికి యిలా పరిణమిస్తుందని కలలోగూడా వూహించలేదు దేవా. నీవే లేవని కొందరు, అందరూ వకటేఅని మరికొందరూ, వారు వేరు, వీరు వేరు, అని కొందరూ, వారు ఉండకూడదని కొందరూ, వీరిని అణగ ద్రొక్కాలని కొందరూ, ఈ మచ్చరము, ఈ అసూయ, ఈ భిన్నాభిప్రాయాలు, సాధుహింస, కొట్లాటలు, ఈ రక్త పాతము, వినలేక చూడ లేక హృదయం బ్రద్దలవుతోంది. ఓ వీర భారత సహోదరులారా! మీరు అనేక సంవత్సరాలు దారాపుత్రులను విడచి, సర్వమూ త్యజించి, కారా గృహాలలో పడరాని కష్టాలననుభవించి, అందరూ వకటేనని ఉద్ఘోషించి, భారత దాస్య శృంఖలాలని త్రెంచి తెచ్చిన స్వరాజ్యమేనా యిది? "అందరు మానవులొకటేయైనా, మనకీ ఖర్మము తప్పదిదేలా" అన్న సంగీతాలూ, "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" అన్న గేయాలు, మనకి స్వాతంత్ర్యం వచ్చే వరకునేనా పరమేశ్వరా! న్యాయం, ధర్మం, సత్యం, అహింస, యివన్నీ ప్రయాణమై, మన పూజ్య బాపూజీతో పాటు అమరత్వాన్ని పొందాయా! గాంధీజీయే మన ఆదర్శ పురుషుడు, మనం అంతా ఆయనమార్గాన్ననుసరించి నడచు కోవాలి" అనే వార్తలు గాలివార్తలూ, పైపై మాటలూ నేనా? పదవీ వ్యామోహం అనే దారుణ పిశాచం, ప్రజలని మార్చి, తల్లక్రిందులుజేసి తమ కర్తవ్యాన్నే మరపింపజేసిందా. బాపూజీ బోధ మానవ హృదయాలని స్పందించి, ఏనాటికైనా క్రియా రూపకంగా వెలువడుతుందా, లేక యాదవ కులములో ముసలంలా పరిణమిస్తుందా. ఏమి నీ మాయ ప్రభో! సంతతము నీ ధ్యానప్రభావమున కర్మపరిపక్వము నొంది, ప్రజలలో నీ భక్తి మార్గపు అమృతధారలు కురిపించే త్యాగులూ, యోగులూ, సర్వసంగ పరిత్యాగులూకూడా యీ పుణ్యభూమిలోవుండకూడదని నిశ్చయించావా తండ్రీ. ఇన్ని నిర్బంధనాలు పాపం ఆ తెల్లవాళ్లలోకూడా కనపడలేదే. ప్రజలలో ఐకమత్యం కలుగజేసి, నిష్కల్మష ప్రేమభావంతో వర్తించేటట్లు అనుగ్రహించలేవా తండ్రీ! "హిందుఔర్ ముసిలిం ఏక్‌హై" మాట అటుంచి హిందువుతో హిందువులకే కొట్లాటలా? ఈ వృద్ధాప్యంలో యివన్నీ చూసి చూసి దుఃఖించటానికే నన్ను బ్రతికించావా!"

రానురాను కంఠ స్వరం మందమై చీకటిలో కలిసిపోయింది. ముకుళిత హృదయంతో యిల్లు చేరుకున్నాను.

★